క్లుప్తంగా

మైదుకూరు
ఆర్టీసీ డీఎంగా శ్రీలత

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఎం.శ్రీలత గురువారం బాధ్యతలు చేపట్టారు. కడప డిపో నుంచి పదోన్నతిపై ఆమె మైదుకూరు డీఎంగా బదిలీ అయ్యారు. గతంలో మైదుకూరు, ప్రొద్దుటూరులలో శ్రీలత పనిచేశారు. డిపో ఎస్టీఐ విజయమ్మ, టీఐ సరోజమ్మ, హెచ్‌సీ పద్మలత, ఎర్నింగ్ డీసీ జయమ్మ, ఉమాదేవి, జనరల్ ఏడీసీ ఎం.లక్ష్మయ్య, ఎస్ఎండీ రఫీ, సిబ్బంది డీఎంను కలిసి డిపో గురించి వివరించారు.

బి.మఠం పీహెచ్‌సీ తనిఖీ

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రోగులు, సిబ్బంది, మందులు, ఆసుపత్రి సుభ్రతను పరిశీలించారు. సిబ్బంది కొరత ఉందని డాక్టర్ ఓబులేసు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. సిబ్బందిని భర్తీ చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది గురువే

మైదుకూరు : విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేది గురువేనని స్థానిక ఎస్‌బీఎస్ వైఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌బీ సురేష్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రవి కళ్యాణ్ పేర్కొన్నారు. కళాశాలలో గురువారం ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి అధ్యాపకులు, విద్యార్థులు నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ సురేష్ బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రవికల్యాణ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



వెంకటసుబ్బారెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : మండలంలోని నరహరిపురం గ్రామానికి పల్లా నరసింహారెడ్డి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి గురువారం నరహరిపురంలోని పల్లా నరసింహారెడ్డి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబీకులను రఘురామిరెడ్డి పరామర్శించారు. ఇదే క్రమంలో గ్రామానికి చెందిన రాచపల్లె వెంకటసుబ్బారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. వెంకటసుబ్బారెడ్డి ఇంటికి మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వెళ్లి ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట ఎంపీపీ లక్ష్మయ్య, ఎంపీటీసీ శివ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నవీరారెడ్డి, బాలసుబ్బారెడ్డి, వీరారెడ్డి, నాగసుబ్బారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నివాళి

పోరుమామిళ్ల : కాశినాయన మండల కేంద్రమైన నరసాపురం గ్రామంలో గురువారం బారాగజ్‌మహబూబ్‌బాషా కుమారుడు మహబూబ్‌పీరా 108 సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మృతి చెందడం చాలా బాధాకరమని పీసీసీ సభ్యులు అన్వర్ పేర్కొన్నారు. గురువారం మృతుని స్వగ్రామానికి వెళ్లి మహబూబ్‌పీరా మృతదేహానికి నివాళులర్పించి మృతుని తల్లిదండ్రులను పరామర్శించారు.

పోరుమామిళ్ల : మండలంలోని గానుగపెంట పంచాయతీలో ఫీల్డ్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బద్దెన రమణ బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డినాగార్జునరెడ్డి గురువారం ఆయన స్వగృహానికి వెళ్ళి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : తొట్టిగారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జి.అరుణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని పేర్కొన్నారు. గురువారం మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై తొట్టిగారిపల్లె ప్రాథమిక పాఠశాలకు వెళ్ళిన ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్ 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులపై అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తల్లిదండ్రులు ఆరోపించిన నేపథ్యంలో ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయడంతో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు.

ఘనంగా ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం

బి.కోడూరు : మండల కేంద్రమైన బి.కోడూరు మోడల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్ర ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లిరాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించి కేక్ కట్ చేసి పిల్లలకు చాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గవర్నమెంటు హైస్కూల్ హెచ్ఎం వీరశేఖర్, బషీర్, ఉపాధ్యాయులు ఆనంద్, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులు, మాధవిలత, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన లోకంలో వెలుగు దివిటీలు



స్లాలతో ఇంగ్లీషు అక్షరాలు రూపొందిస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయురాలు నాగలక్ష్మిదేవి



పక్షుల గూళ్లను తయారు చేసిన విద్యార్థులతో ఉపాధ్యాయురాలు ఏవీ సుజాత

అమ్మ ఒడి నుంచి అడుగుబయట పెట్టిన చిన్నారికి ఈ ప్రపంచాన్ని పరిచయం చేస్తారు గురువులు. అక్షరాలు దిద్దడం మొదలుకొని మంచి, చెడులను వివరిస్తూ, కష్టనష్టాలను అధిగమించడం నేర్పిస్తూ ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దుతారు. అజ్ఞానమనే చీకటిని పారదోలి, జ్ఞానదీప్తిని వెలిగించే టీచర్లు మనం ఎంత ఎత్తు ఎదిగినా చిరకాలం స్మరించుకుంటూనే ఉంటాం. అలా పిల్లల జీవితాల్లో విజ్ఞాన దివిటీలు వెలిగిస్తున్న టీచర్ల గురించి ఈ టీచర్స్ డే సందర్భంగా గుర్తు చేసుకుందాం.

- స్ఫూర్తి దాయకం.. సృజనాత్మక బోధన
- అందరి ప్రశంసలు అందుకుంటున్న ఉపాధ్యాయులు

మైదుకూరు : ప్రస్తుతం పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బోధనేతర పనులతో తీరిక లేకుండా పోతోంది. పిల్లలకు పాఠాలు చెప్పడం సెకండరీ అయిపోయింది. యాప్‌లతో సతమతమవుతూ పిల్లల్లో సృజనాత్మకతను పెంచే అవకాశం లేకుండా పోతోంది. అయితే బోధనేతర పనులతో ఎంత పని ఒత్తిడి ఉన్నా పిల్లలకు మంచి విద్యను అందించి వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలనే ఆశయం ఉన్న పలువురు ఉపాధ్యాయులు, ఉన్న సమయంలోనే విద్యార్థులకు సృజనాత్మక బోధనను అందిస్తున్నారు. మైదుకూరు మండలం సుంకులుగారిపల్లె పాఠశాల ఉపాధ్యాయురాలు మైనపు రెడ్డి నాగలక్ష్మి దేవి, దయాంఖాన్‌పల్లె పాఠశాల ఉపాధ్యాయురాలు ఏవీ సుజాత ఆ కోవలోకి వస్తారు. సుంకులుగారిపల్లె పాఠశాలలో నాగలక్ష్మిదేవి వినూత్న రీతిలో బోధనా పరికరాలను రూపొందించి పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. రోజురోజుకు విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్న సమయంలో ఆమె చాపాడు మండలం నుంచి బదిలీపై సుంకులుగారిపల్లె పాఠశాలకు వచ్చారు. విద్యార్థులకు వినూత్న రీతిలో పాఠాలను బోధిస్తూ గ్రామస్తుల మన్ననలను అందుకున్నారు. జాతీయ పండుగలు, దేశ నాయకుల జన్మదిన సందర్భాలలో వాటి గురించి పిల్లల్లో అవగాహన కల్పించి గ్రామంలో ర్యాలీలు నిర్వహించడం, సొంత ఖర్చులతో పిల్లలతో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణ చేయిస్తూ విద్యార్థుల్లో జాతీయ భావనను పెంపొందిస్తున్నారు. చాపాడు మండలం మొరాయిపల్లె పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు నాగలక్ష్మి దేవి రూపొందించిన 'పర్మినెంట్ మ్యాథ్స్ టీఎల్ఎం' ప్రాజెక్టు విద్యా అమృత మహోత్సవ్ సందర్భంగా 2022–23లో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించిన పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి ఆమెకు జాతీయ పురస్కారాన్ని తెచ్చి పెట్టింది.

వినూత్న కృత్యాలతో విద్యాబోధన

మండలంలోని దయాంఖాన్‌పల్లె పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఏవీ సుజాత పిల్లలకు వినూత్న కృత్యాలతో విద్యాబోధన చేస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. పాఠ్యాంశాలను ప్రాక్టికల్‌గా చేయిస్తూ పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందిస్తున్నారు. సైన్స్ ప్రాజెక్టులు, పర్యావరణం తదితర అంశాలపై ప్లకార్డులు తయారు చేయిస్తూ ఆయా అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆటపాటలతోనే బోధన అనే నానుడికి నిదర్శనంగా నిలుస్తున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ ఇరువురు ఉపాధ్యాయినుల ఆశయం ఎంతో మందికి స్ఫూర్తినివ్వాలని కోరుకుందాం.

టీడీపీ నేతల నుంచి మున్సిపాలిటీకి డబ్బు కట్టించండి



మాట్లాడుతున్న కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తనయుడు కొండారెడ్డితోపాటు ఆయన సహచరులు రిలయన్స్ మార్ట్‌ను నిర్మించారనే విషయం ప్రొద్దుటూరు ప్రజలకు తెలియంది కాదని 28వ వార్డు కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ రిలయన్స్ మార్ట్ రూ.5.80 కోట్లు డీవియేషన్ అమౌంట్ చెల్లించాలని మున్సిపాలిటీ నోటీసు ఇచ్చినా స్పందించలేదని విమర్శించారు. ఈ బకాయిలు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడేలా కృషి చేయాలని ఐదో వార్డు టీడీపీ కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డికి సూచించారు. అలాగే గత ఏడాది నిర్వహించిన ఎగ్జిబిషన్ వేలానికి సంబంధించి టీడీపీ వర్గీయుడు చలపతి రూ.32.50 లక్షలు జీఎస్టీ మొత్తాన్ని మున్సిపాలిటీకి చెల్లించాల్సి ఉందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా సోదరుడు నిజాం మాట్లాడుతూ మార్కెట్ వేలంపాట తనతోపాటు తన మిత్రుడు రామాంజనేయరెడ్డి పాడటం జరిగిందన్నారు. భార్యా భర్తల పంచాయితీలో పెళ్లికొడుకు సంబంధించిన రూ.లక్షా 40వేలు మొత్తాన్ని కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి ఆరు నెలలు తన వద్ద పెట్టుకుని తిరిగి ఇవ్వడానికి మనస్సు ఒప్పలేదన్నారు. పెద్ద మనషుల పంచాయితీతో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి చేతి నుంచి రూ.లక్ష, తన సోదరుడు ఆయిల్ మిల్ ఖాజా రూ.50వేలు చెల్లించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు ద్వార్యల గురునాథరెడ్డి, మోడెం సందీప్ పాల్గొన్నారు.

తోపుడు బండ్ల అంశాన్ని రాజకీయం చేయొద్దు

ప్రొద్దుటూరు : కూరగాయల మార్కెట్ ఎదుట పెద్దమ్మ ఆలయం వైపు ఉన్న తోపుడు బండ్ల అంశాన్ని రాజకీయం చేయొద్దని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ గత మున్సిపల్ కమిషనర్ ఈ అంశంపై నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రస్తుతం ఉద్దేశ పూర్వకంగా ఐదో వార్డు టీడీపీ కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తనయుడు కొండారెడ్డిని తీసుకొచ్చి ప్రస్తుత కమిషనర్‌కు ఫిర్యాదు చేయించారన్నారు. పేదలు జీవనాధారంగా తోపుడు బండ్లను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి అందరిపై కుప్పలు తెప్పలుగా ఆర్‌టీఐ ఫిర్యాదులు పెట్టి డబ్బు సంపాదించారన్నారు. ఫిర్యాదుల ద్వారా ఆయన ఎంతో మందిని వేధిస్తూ వరదరాజులరెడ్డికి చెడ్డ పేరు తెస్తున్నారన్నారు. చేతనైతే రిలయన్స్ మార్ట్ వద్ద ఏర్పాటు చేసిన జనరేటర్‌ను తొలగించాలని కోరారు. అనిబిసెంట్ మున్సిపల్ పాఠశాల మైదానంలో మార్కెట్‌ను ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధం కాదా అని ప్రశ్నించారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఇష్టారాజ్యం!



తలుపులు తెరుచుకోని తహసీల్దార్ చాంబర్



10.45 గంటల వరకూ కార్యాలయానికి ఎవరూ రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

- సమయం పాటించని అధికారులు, సిబ్బంది
- అవస్థలు పడుతున్న ప్రజలు

బ్రహ్మంగారిమఠం : బి.మఠం తహసీల్దార్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గురువారం ఉదయం 10.45 గంటలవరకూ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఒక్కరూ రాకపోవడం గమనార్హం. కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు సచివాలయం సిబ్బంది మాత్రం ఉన్నారు. ఆ తర్వాత నుంచి నెమ్మదిగా ఒక్కొక్కరు కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో పని నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతిరోజు మండలంలోని పలు గ్రామాల ప్రజలు కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారు. ప్రజలు భూ సంబంధిత, పలు సర్టిఫికెట్ల జారీ తదితర విషయాల గురించి కార్యాలయ సిబ్బందిని అడిగితే చెప్పకపోగా.. దురుసుగా ప్రవర్తిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు ఎవ్వరూ మండల కేంద్రంలో ఉండటం లేదు. 30 నుంచి 50 కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్నారు. వారంలో మూడు రోజులు ఇలాంటి పరిస్థితి వస్తుందని స్థానికులు అంటున్నారు. రేకలకుంట, నాగిశెట్టిపల్లె, దిరసవంచ, మల్లేపల్లె, ముడుమాల, వంటి గ్రామ పంచాయతీలకు చెందిన వీఆర్‌ఓలు ఎక్కడ ఉంటారో ఎవరికి తెలీదు. కార్యాలయ సిబ్బంది పనితీరుపై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే కార్యాలయ అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమయ పాలన పాటించని కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలు

బద్వేలు అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలు కొనసాగిస్తామని అఖిలభారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 12, 13, 14వ తేదీల్లో కడప నగరంలో జరగనున్న ఏఐఎస్‌బీ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం స్థానిక ఎస్సీ కళాశాల వసతిగృహంలో మహాసభల గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తూ గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేస్తోందని అన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కడప నగరంలో జరగనున్న జాతీయ మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఏఐఎస్‌బీ పట్టణ నాయకులు సుహేష్, వెంకటేష్, జయరామ్, తిరుపతి, సాయి, రంగస్వామి పాల్గొన్నారు.

'చలో విజయవాడ' జయప్రదం చేయండి

మైదుకూరు : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6వ తేదీన జరిగే ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వై.రాహుల్, ఉపాధ్యక్షుడు రాజశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం మైదుకూరులో కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా విద్యార్థుల సమస్యలను, హామీలను గాలికొదిలేసిందని విమర్శించారు. విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్ మంజూరు చేయక, ఫీజులు కడితేనే పరీక్షలకు అనుమతి ఇస్తామని యాజమాన్యాలు తేల్చిచెప్పడంతో తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ మహిళా కన్వీనర్ శిరీష పాల్గొన్నారు.


ఉల్లి సాగులో ఖర్చులు తగ్గించుకోవాలి

మైదుకూరు : ఉల్లి పంట సాగు చేసే రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలని మైదుకూరు ఉద్యాన శాఖ అధికారి రామకృష్ణ తెలిపారు. గురువారం మైదుకూరు పరిధిలోని లింగాలదిన్నె, శెట్టివారిపల్లె, ఎస్.మైదుకూరు గ్రామాల్లో రైతులు సాగు చేసిన ఉల్లి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ రైతులు మంచి ఉల్లి విత్తనాలను ఎంపిక చేసుకుని సంకర రకాలను ఎన్నుకోవాలని సూచించారు. బిందు సేద్య పరికరాలను అమర్చుకొని ఎత్తుమడుల పద్ధతిలో సాగు చేయడం వలన ఉల్లిలో సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని అన్నారు. దిగుబడిని పెంచుకోవడమే కాక గడ్డల నాణ్యతను పెంచవచ్చని అన్నారు. మైదుకూరు డివిజన్‌లో 4,670 ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారని తెలిపారు. ఇందులో పెద్ద బళ్లారి మైదుకూరులో 1600 ఎకరాలు, దువ్వూరులో 900 ఎకరాలు, ఖాజీపేటలో 55 ఎకరాలు, చాపాడులో 15 ఎకరాలు సాగులో ఉండగా.. కేపీ ఉల్లి మైదుకూరులో 500 ఎకరాలు, దువ్వూరులో 1600 ఎకరాలు ఉందని వివరించారు. గడ్డలు పూర్తిగా ఊరిన తర్వాతే కోయాలని రైతులు తొందరపడి ముందుగా కోయవద్దని తెలిపారు. ఉల్లి పంటను నిల్వ చేసుకునేందుకు గోదాములు నిర్మించుకోవడానికి ఉద్యాన శాఖ 50 శాతం రాయితీ అందిస్తుందని తెలిపారు. పంటను పరిశీలించిన వారిలో గ్రామ ఉద్యాన అధికారులు వెంకటసుబ్బయ్య, సమీరా, మధుసూదన్ రెడ్డి, రమాదేవి, గ్రామ వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ ఉన్నారు.

ప్రొద్దుటూరును జిల్లాగా ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరును జిల్లాగా ఏర్పాటు చేయాలని ది ప్రొద్దుటూరు బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు కోరారు. గురువారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరుకు జిల్లాకు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని తెలిపారు. గతంలో ప్రొద్దుటూరును కాకుండా అన్నమయ్య జిల్లాను చేశారని, ఈ సారి అందరు కలిసికట్టుగా పోరాడి ప్రొద్దుటూరు జిల్లాను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొద్దుటూరు బంగారు, వస్త్ర, పత్తి, ఆయిల్ తదితర అన్ని వ్యాపారాలకు కేంద్రమని, జనాభా, విస్తీర్ణం ఎక్కువని తెలిపారు. జమ్మలమడుగు, మైదుకూరు, పులివెందుల తదితర ప్రాంతాలను కలిపి ప్రొద్దుటూరు జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య ఉపాధ్యక్షుడు ప్రతాప్ నాయుడు, జీసీ పుల్లయ్య, భాస్కర్ యాదవ్, కార్యదర్శి దస్తగిరి, ట్రెజరర్ మడక సంటయ్య, కోట వీధి దస్తగిరి, పోసా ఆదినారాయణ, గిద్దలూరు మల్లికార్జున, శ్రీనివాసులు, చౌడయ్య, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాళ్లయ్యా.. ఉంటామయ్యా



ప్రొద్దుటూరు కల్చరల్ : వినాయకుడి నిమజ్జన గ్రామోత్సవం



బద్వేలు అర్బన్ : నిమజ్జనానికి వెళుతున్న గణనాథుడు

బద్వేలు అర్బన్ : వినాయకచవితి సందర్భంగా పట్టణంలో ఏర్పాటుచేసిన పలు విగ్రహాలకు 9వ రోజైన గురువారం కోలాహలంగా నిమజ్జనం నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథునికి, సిద్దవటం రోడ్డులోని ఎన్‌జీవో కాలనీ సమీపంలో ఏర్పాటుచేసిన గణనాథునికి, రూపరాంపేట, బంకపాలెం, గొల్లఖాజాబావివీధి, లక్ష్మీపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు 9 రోజుల పాటు విశేష పూజలు అందించి ఉండ్రాళ్లయ్యా.. ఉంటామయ్యా అంటూ నిర్వాహకులు నిమజ్జనానికి తరలించారు. విగ్రహాల వెంట అశేష భక్త జనం వెంటరాగా డప్పుల వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లు, యువకుల కేరింతల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. పుర వీధుల గుండా మేళతాళాలతో ఊరేగించగా భక్తులు ఆయా విగ్రహాల ముందు నీరు వారపోసి కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. గ్రామోత్సవం వెంట భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బద్వేలు అర్బన్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా గ్రామోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువైన వినాయకుడిని గురువారం నిమజ్జనానికి తరలించారు. ఉదయం స్వామివారి విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి ట్రాక్టర్లలోకి ఎక్కించారు. వినాయకనగర్, మనోజీ రావు వీధి, దేవాంగపేట, వైఎంఆర్ కాలనీ, తదితర ప్రాంతాల్లోని ఉత్సవ కమిటీ వారు గణనాథుల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం చెక్కభజన, కోలాటం, బాణసంచా పేలుళ్లు, కళాకారుల ప్రదర్శనలు, డప్పు వాయిద్యాల సందడి మధ్య కామనూరు కుందూనదికి తరలించి అక్కడ నిమజ్జనం చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి

కలసపాడు : స్థానిక పీహెచ్‌సీని గురువారం ఆలిండియా హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజర్ సెక్రటరీ పి.వి.ఐ.రాజు సందర్శించారు. ఆసుపత్రిలో వైద్యాధికారులు డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా వర్షాలు పడి ఎక్కడ నీరు అక్కడ నిల్వ ఉండటం వలన విషజ్వరాలు సోకి చాలా మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రభుదాస్, ప్రసాద్, సుధాకర్, సీహెచ్‌ఓ వెంకటసుబ్బమ్మ, ఎంపీహెచ్‌ఓ రామతీర్థం పాల్గొన్నారు.

ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం

ప్రొద్దుటూరు : కూటమి ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాషా విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఏటా 7 లక్షల టన్నుల యూరియా అవసరమైతే కూటమి ప్రభుత్వం 4–5లక్షల టన్నుల యూరియా ప్రైవేట్ వ్యాపారులకు ఇచ్చిందని తెలిపారు. యూరియా బస్తా రూ.1000 పెట్టినా దొరకడం లేదన్నారు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా రైతులు తిరిగినా ఒక బస్తా యూరియా అందడం లేదన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు

బి.కోడూరు : నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్ అన్నారు. మండలంలోని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌ల ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా ర్యాలీ నిర్వహించి నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య మాట్లాడుతూ అన్ని అవయవాల కన్నా కళ్లు ప్రధానమని, ఒకరు కళ్లు దానం చేస్తే ఇద్దరికి చూపు ఇచ్చిన వారవుతారని, కళ్లు దానం చేయదలచిన వారు పీహెచ్‌సీలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరణించిన 6 గంటలలోపు నేత్రాలను సేకరించవచ్చని, దగ్గరలోని ఐ బ్యాంకు వారికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని, వారు వచ్చి నేత్రాలను సేకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, స్టాఫ్‌నర్సులు సునీత, విజయలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దళితులను విస్మరించిన కూటమి ప్రభుత్వం

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దళితులను విస్మరిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు కేటాయించి దళితవాడలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తే నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం దళితవాడల అభివృద్ధిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డులో గల బంకపాలెం దళితవాడలో అక్కడి ప్రజలు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.కూటమి ప్రభుత్వ పెద్దలు స్పందించి దళితవాడల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

యానిమేటర్ పోస్టును ఎస్సీలకు కేటాయించాలి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీ నరసన్నపల్లె ఎస్సీ కాలనీలో ద్వాక్రా సంఘం యానిమేటర్ పోస్టును ఎస్సీలకే కేటాయించాలని సీపీఐ మండల శాఖ కార్యదర్శి పెదుల్ల పల్లె ప్రభాకర్ కోరారు. గురువారం బి.మఠంలో ఆయన విలేకరులతో మాట్లాగుతూ గతంలో ఎస్సీ మహిళే యానిమేటర్ ఉండేవారని, ఆమె రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీగా ఉందని తెలిపారు. గతంలో ఉన్న ఏపీఎం, సీసీలు యానిమేటర్ స్థానాన్ని పూర్తి చేయాలని సమావేశం కూడా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఎస్సీలకు కేటాయించకుండా ఇతరులకు కేటాయిస్తే ఉద్యమం చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

క్షయ ప్రాణాంతకమైన వ్యాధి కాదు

ప్రొద్దుటూరు క్రైం : క్షయ ప్రాణాంతకమైన వ్యాధి కాదని, మందుల ద్వారా నయం చేసుకోవచ్చని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శివశంకరయ్య తెలిపారు. పట్టణంలోని సాయికుటీర్‌రోడ్డులో ఉన్న గౌతం హైస్కూల్ విద్యార్థులకు క్షయ, కుష్టు వ్యాధుల గురించి గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శివశంకరయ్య మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు ఉంటే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చూపించుకోవాలన్నారు. టీబీ సూపర్‌వైజర్ బండి రాజారత్నం క్షయవ్యాధి లక్షణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. విద్యార్థులు వ్యాధుల పట్ల అవగాహన పొంది, కుటుంబ సభ్యులు, పరిసర ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఓ ఎంపీ సుబ్బారెడ్డి, వార్డు హెల్త్ సెక్రటరి ఉదయలక్ష్మి, ఆశా వర్కర్లు ఉమా, నూర్జహాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.